నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ మురుగుడు | దొంతిరెడ్డి వేమారెడ్డి | వనమా బాల వజ్రబాబు

మంగళగిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందోత్సాహాలతో జీవించాలని ఆకాంక్షించారు.

తాడికొండ: తాడికొండ నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో విలసిల్లాలని భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు.

వేణుగోపాలుడికి విశేష అర్చనలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి మార్గశిర శుద్ధ పాడ్యమిని పురస్కరించుకొని మంగళవారం విశేష అర్చనలు నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తులసీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. గీతా భజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్తనామ, లలితా సహస్త నామ పారాయణ కావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పశుగ్రాస సాగుకు దరఖాస్తులు



ఫిరంగిపురం: బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సొంతపొలం, కౌలుపొలం వివరాలు అందజేయాలని పశుసంవర్ధక వైద్యుడు పీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ పది సెంట్ల నుంచి యాభై సెంట్ల వరకు ఉన్న రైతులు తమ పశువులకు మేతకుగాను నాలుగు దశల్లో వచ్చే గడ్డికి ఆయా గ్రామాల్లోని సిబ్బందికి దరఖాస్తులు అందజేయాలన్నారు. దీనికి గాను ఉపాధి హామీ నిధులు కూలీవేతనం ఖర్చు, మెటీరియల్ ఖర్చులతో కలిపి 50 సెంట్లు ఉన్నవారికి రూ.32వేలు, 40సెంట్లుకు రూ. 26,304, 30 సెంట్లకు రూ.19,795, 20సెంట్లకు రూ.13,197, 10సెంట్లుకు రూ. 6,500 నగదు అందజేస్తారన్నారు. అర్హులైన వారు దరఖాస్తుతో పాటు పొలం 1బీ జిరాక్స్, బ్యాంకు పాసు పుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులను అందజేయాలని సూచించారు.

36 గోకులం షెడ్లు మంజూరు



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో పాడి రైతులు షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు 36 గోకులం షెడ్లు మంజూరు అయినట్లు ఏపీఓ జయకుమార్ తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడులో వేసిన గోకులం షెడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోకులం షెడ్లను పాడిరైతులు నిర్మించుకునేందుకు పశుసంవర్థక శాఖ మరియు ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో అనుమతి అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అమీనాబాద్‌కు 3 షెడ్లు, ఫిరంగిపురం-3, గొల్లపాలెం -3, రేపూడి-3, మునగపాడు-1, నుదురుపాడు-1, బేతపూడి-2, 113తాళ్లూరు-3, గుండాలపాడు-4, యర్రగుంట్లపాడు -2. కండ్రిక-2, మేరికపూడి-2, పొనుగుపాడు-3, శిరంగిపాలెం-1, తక్కెళ్లపాడు-1, వేమవరం-2 మంజూరు అయ్యాయన్నారు. ఇప్పటికే మండలానికి కేటాయించిన 36 షెడ్లకు అనుమతులు వచ్చినట్లు చెప్పారు. వీటికి రూ. 2.30 లక్షలు కేటాయిస్తారన్నారు. ఇప్పటికే 10 షెడ్లు పూర్తి అయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

తెనాలిరూరల్: విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు నిరసనగా సేవ్ పవర్ సెక్టార్, సేవ్ ఇండియా డిమాండ్‌తో స్థానిక చెంచుపేటలోని విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ వీవీ చిరంజీవి మాట్లాడుతూ చండీఘర్‌లోని విద్యుత్ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామని, విద్యుత్ ప్రవేటీకరణకు తాము వ్యతిరేకమని చెప్పారు. సీఐటీయూ నాయకుడు కేబీ ప్రసాద్, ఏడీఈ బి. అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అంతటా న్యూ ఇయర్ జోష్!

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- కేకులు కట్‌చేసి, స్వీట్లు పంచుకుని స్వాగతం పలికిన ప్రజలు
- పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



తాడికొండలో స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మంగళగిరిలో రంగుల విక్రయాలు



మంగళగిరి మెయిన్‌రోడ్డులో కేక్‌ల విక్రయాలు

తాడికొండ: పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తాడికొండ నియోజకవర్గ ప్రజలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వీట్లు కొనుగోలు చేయడంతో పాటు కేకులు కట్ చేసి యువత కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి పెద్ద ఎత్తున సందడి చేశారు. పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడాయి. దుకాణాల వద్ద మద్యం తాగేందుకు అనుమతి లేకపోయినా నిర్వాహకులు అన్ని వసతులు ఏర్పాటు చేయడంతో వైన్‌షాపులు రెస్టారెంట్‌లను తలపించాయి.

మంగళగిరిలో..

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగర పరిధిలో నూతన సంవత్సర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వీట్ల దుకాణాలు, బేకరీలు జనంతో కిటకిటలాడాయి. యువతీ యువకులు కేకులు, స్వీట్లు భారీగా కొనుగోలు చేస్తూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకుంటు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

చేతివృత్తుల వారికి శిక్షణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా పరిధిలో పట్టణంలో వున్న ప్లంబర్స్, కార్పెంటర్స్, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గ్రీజర్, టీవీ మెకానిక్, బ్యూటీషియన్‌లతో పాటు అన్నిరకాల సేవలు అందించేవారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందజేసి హోం ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి కల్పిస్తారని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జనవరి 2వ తేదీలోపు ఎంటీఎంసీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస మహోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలు మంగళవారంతో 16వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం 16వ పాశురాన్ని భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా గోదాఅమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్ఠి, మంగళ శాసనములతో కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించామని, హైదరాబాద్, మచిలీపట్నం, నగరి, హిందూపురం ప్రాంతాలకు చెందిన భక్తులు సుమారు 230 మంది భక్తులు గోదా దేవికి సారె సమర్పించారని వివరించారు. సారె సమర్పించిన భక్తులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి వారి మంగళాశాసనాలు అందజేశారని, అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు అందరినీ అలరించాయని తెలిపారు. ఈ రోజు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డు చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ విచ్చేసి స్వామివారి మంగళాశాసనాలు అందుకున్నారని అన్నారు.

మంత్రి లోకేష్ ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎన్నికల ముందు నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పండుగ రోజు సైతం కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని అన్న నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. 31 సంవత్సరాలుగా ఏసీసీ కార్మికులు తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం న్యాయపోరాటం చేస్తున్నారని, పాలక పక్షాలు, అధికారులు కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ దీక్షలలో రమాదేవి, శారమ్మ, సామ్రాజ్యం, హిమాంబి, శారద కూర్చొనగా, ఎసిసి కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, కె. ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు నరసింహారావు, సూర్యప్రకాష్, ఆశీర్వాదం,బాష, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



కార్మెల్‌పేటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం: అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్ అందజేస్తామని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని కార్మెల్‌పేట, విజ్ఞానపురంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాడికొండలో పింఛన్ల పంపిణీ

తాడికొండ: తాడికొండ మండలంలో సామాజిక పింఛన్లు మంగళవారం 95 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కె.సమతావాణి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలో పింఛన్లు పంపిణీ ప్రారంభించి ఉదయం నుంచే 10,214 పింఛన్లకు గాను 9618 మందికి పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యదర్శి హరిబాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 17 గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైంది. ఉదయం 5.30 గంటలకు పెన్షన్ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టామని, 9184 మందికి వివిధ రకాల పెన్షన్లు ఇవ్వాల్సి ఉండగా, 8791 మందికి అందజేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు.

ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షుడిగా సుదర్శన్‌రాజు



ఫిరంపురం: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫిరంగిపురం తాలూకా యూనిట్ ప్రెసిడెంటుగా గ్రామానికి చెందిన కొండపల్లి సుదర్శన్‌రాజు ఎంపికయ్యారు. ఈసందర్భంగా గుంటూరులోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ చాంద్‌బాష, కార్యదర్శి కేవీఎస్ శివారెడ్డిలు సుదర్శన్‌రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం సుదర్శన్‌రాజు మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పలువురు ఉద్యోగులు సుదర్శనరాజుకు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు తొమ్మిది అర్జీలు

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అడంగల్ మరియు పాసుపుస్తకాలకు సంబంధించి 8 అర్జీలు, భూమి కొలతలకు సంబంధించి ఒక అర్జీ మొత్తం 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, షేక్ ఫరీద్ బాష, వీఆర్వో చిన్న అబ్బులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మహాదివ్యక్షేత్రంలో నిత్యకల్యాణం

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో ఉన్న శ్రీ వైష్ణవ మహాదివ్యక్షేత్రంలో నేటి నుంచి తిరుమల తరహాలో నిత్యకళ్యాణం చేయనున్నామని క్షేత్రం అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి సుప్రభాతం సేవ మొదలుకొని ఏకాంత సేవ వరకు నిత్యం నిర్వహించనున్నామని, గత సంవత్సరం ఏప్రిల్ 23వ తేదీ నుంచి అఖండ హనుమాన్ చాలీసా ప్రారంభించామని, ఇప్పటి వరకు 253 రోజుకు చేరుకుందని, యాగశాలలో ప్రతిరోజూ శ్రీరామరక్ష యజ్ఞం నిర్వహిస్తూ ఉదయం సుందరకాండ పారాయణ చేస్తూ 108 రోజుల పాటు శ్రీరామ కళ్యాణం నిర్వహించనున్నామని, ఆఖరి రోజు లక్షమంది భక్తులతో కళ్యాణం ముగిస్తామని తెలిపారు. దూపగుంట్ల శ్రీనివాసరావు, కోశాధికారి ఉమామహేశ్వరరావు గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని సక్రమంగా అమలు చేయాలి

తాడేపల్లిరూరల్: పేద ప్రజల పాలిట సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ పథకం బకాయిలు వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కోరారు. మంగళవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేవిధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద వారికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారని అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసిందని, మాజీసీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయాన్ని రూ. 5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచారని గుర్తు చేశారు.

ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రజలకు అందించిన సేవలకు బిల్లులు చెల్లించకుండా సుమారు రూ.3 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టిందని, దీంతో ఆరోగ్యశ్రీ కార్డుతో ఆసుపత్రులకు వెళితే యాజమాన్యాలు వెనక్కు పంపుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి సత్వరమే బకాయిలు చెల్లించి పేదలకు ఉపయోగపడే ఆరోగ్యశ్రీ పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

రోడ్ల మరమ్మతుల్లో నాణ్యతా లోపాలు

కౌన్సిల్ సమావేశంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన సభ్యులు

తెనాలిరూరల్: పట్టణంలో జరుగుతున్న రోడ్ల మరమ్మతులలో నాణ్యత లోపించిందని, కాంట్రాక్టర్ల వద్ద కమీషన్‌లకు అలవాటు పడిన అధికారులు పనులను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ సయ్యద్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కాగా చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సభ్యులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అజెండాలో పొందు పరిచిన 62 అంశాలతో సాధారణ సమావేశం ప్రారంభం కాగా పలు విషయాలకు సంబంధించి సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న రోడ్ల ప్యాచ్ వర్క్‌లు నాణ్యత లేవంటూ కౌన్సిలర్లు త్రిమూర్తి, దేసు యుగంధర్, వైస్ చైర్ పర్సన్ అత్తోట నాగవేణి, అడసుమల్లి వెంకటేశ్వరరావు, దాసరి వీర వసంతరావు, షేక్ ఇస్మాయిల్ తదితరులు ప్రశ్నించారు. వార్డుల్లో పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని అధికారుల పనితీరు బాగా లేదని కాంట్రాక్టర్ల వద్ద కమిషన్లకు కక్కుర్తి పడి పనులను పట్టించుకోవడం లేదంటూ టిడిపి కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి ఆరోపణలు చేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు వివరణ ఇచ్చారు. పనులు పర్యవేక్షణ చేయిస్తామని తెలిపారు.